తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 12 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:255 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కొడంగల్ ఆరవ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు
- హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరిక
- ఓటు అనంతరం తిరిగి రాజధానికి ప్రయాణం

కొడంగల్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని ఆరవ వార్డు పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. సాధారణ ఓటర్ల మాదిరిగానే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి తాండూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడి నుంచి భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

మిగతా 2లో..



## మున్సిపల్ ఎన్నికలలో

# పోలింగ్ ఉత్సాహం.. కొన్ని చోట్ల ఉద్రిక్తతలు

- ఉదయం నుంచే ఓటర్ల రద్దీ
- మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డిలో ఘర్షణలు
- దొంగ ఓట్ల యత్నాలు అడ్డుకున్న సిబ్బంది

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 116 స్థానాలకు ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివస్తుండగా, ఎన్నికల సంఘం మరియు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎక్కువ ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నప్పటికీ, కొన్ని కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు నమోదయ్యాయి. సదాశివపేటలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న అభ్యర్థిని ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

మిగతా 2లో..



## అధికార దుర్వినియోగం

# దుర్మార్గం



- ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపణ
- బీఆర్ఎస్ అభ్యర్థులపై బెదిరింపులు, దాడులపై ఆగ్రహం
- ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ మంత్రి హరీశ్ రావ్

2లో



మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతానికి పైగా

# విజయం కాంగ్రెస్‌దే

మంత్రి పొన్నం ప్రభాకర్

- బీజేపీ–బీఆర్ఎస్ కలసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయని ఆరోపణ
- రెండు సంవత్సరాల్లో ప్రజాపాలన పథకాల అమలుపై విశ్వాసం
- కేంద్రం నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని విమర్శ

2లో

# నా ఓటు వేరేవారు వేశారు అంటూ మహిళ ఆగ్రహం

- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఘటన
- పోలింగ్ కేంద్రంలోనే బయటపడిన వ్యవహారం
- సిబ్బందిని నిలదీసిన పౌరజాతం

2లో



## కాంగ్రెస్ అరాచకాలకు లొంగలేదు

# గులాబీ సైన్యం: కేటీఆర్

- పురపాలక సమరంలో పోరాట స్ఫూర్తికి అభినందనలు
- అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- వేధింపులకు భారీ మూల్యం చెల్లించాల్సిందేనని హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):

మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలకు పాల్పడినా గులాబీ సైనికులు వీరోచితంగా పోరాడారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు పురపాలక సమరంలో కార్యకర్తలు కనబరిచిన పోరాట స్ఫూర్తి పార్టీకి కొండంత బలం ఇచ్చిందని, ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలిపారు. రెండేళ్ల పాలనలో పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో దౌర్జన్యాలకు దిగారని కేటీఆర్ ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రారంభమైన పరాభవం పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతో అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు.

మిగతా 2లో..



## 70% స్థానాల్లో కాంగ్రెస్ దూసుకెళ్తుందన్న

# పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్




- మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం
- కరీంనగర్, నిజామాబాద్‌లో బీజేపీ బలపాటు
- కొన్ని కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ పాత్ర
- బీఆర్ఎస్‌కు కార్పొరేషన్లలో నిరాశాజనక అంచనాలు
- రామగుండం, మంచిర్యాలల్లో కాంగ్రెస్ జోరు
- మహబూబ్‌నగర్, నల్లగొండలో త్రిముఖ పోటీ
- మున్సిపాలిటీల వారీగా సీట్ల అంచనాలు
- మొత్తం వార్డుల గెలుపులో కాంగ్రెస్ ఆధిపత్యం

2లో

# డిప్రెషన్ ఒక్కటే కారణం కాదు

- విజయశాంతి రెడ్డి ఆత్మహత్య కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
- కుటుంబ సభ్యులు సహా 12 మందిని విచారించిన పోలీసులు
- ఫోరెన్సిక్ నివేదిక అనంతరం స్పష్టతకు అవకాశం

2లో

# మీ డేటాను సైబర్ నేరగాళ్ల చేతుల్లో పెట్టొద్దు

తెలంగాణ పోలీసులు హెచ్చరిక

- అపరిచిత వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయొద్దని సూచన
- క్రెడిట్, డెబిట్ కార్డు సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని పిలుపు
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నా ఓటు వేరేవారు వేశారు అంటూ మహిళ ఆగ్రహం

**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఓటు వేయడానికి వెళ్లిన పారిజాతం అనే మహిళకు షాక్ తగిలింది. పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన పేరు చెప్పగా, ఇప్పటికే మీ ఓటు నమోదైందని సిబ్బంది తెలిపినట్లు ఆమె ఆరోపించారు. ఈ విషయంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైన పారిజాతం, తన వద్ద ఉన్న గుర్తింపు పత్రాలు చూపించినప్పటికీ, ఓటు ముందే నమోదైందని అధికారులు చెప్పారని వెల్లడించారు. తన హక్కైన ఓటును వేరేవారు వేయడం ఎలా జరిగిందని ప్రశ్నించారు. అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని, అయినా వేరే వ్యక్తులు ఓటు వేస్తుంటే పోలింగ్ సిబ్బంది ఏమి చేస్తున్నారని ఆమె నిలదీశారు. ఓటర్ల జాబితా ధృవీకరణ, గుర్తింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యమైన ప్రజాస్వామ్య హక్కు కావడంతో, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతానికి పైగా విజయం కాంగ్రెస్‌దే

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసిందని, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రవ్యాప్తంగా 80 శాతానికి పైగా మున్సిపాలిటీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు నిలిచారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల వాతావరణాన్ని అపహాస్యం చేశాయని ఆరోపించారు. ఎక్కడికక్కడ ఘర్షణ వాతావరణం సృష్టించి భౌతిక దాడులకు దిగారని విమర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారని, ప్రభుత్వాన్ని బదనం చేసే కుట్రలు పన్నారు అన్నారు. పోలీసులపై దాడులు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. పది సంవత్సరాల పాలనలో మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వలేని బీజేపీ ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రెండు సంవత్సరాల ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధిని పట్టణాల్లోనూ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం నుండి నిధులు విడుదల చేయకుండా వివక్ష చూపుతోందని, అయినప్పటికీ ప్రజల కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత వారిదేనని, అమలు చేసే వరకు కాంగ్రెస్ నిలదీస్తుందని హెచ్చరించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## కాంగ్రెస్ అరాచకాలకు లొంగలేదు గులాబీ సైన్యం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా లూటీ చేసిన ప్రజాధనంతో ప్రజాతీర్పును మార్చాలన్న కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. పోలీసు శాఖను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపులు, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని కేటీఆర్ విమర్శించారు. ప్రజల తీర్పు చివరికి సత్యాన్ని వెలుగులోకి తీసుకువస్తుందని పేర్కొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన సందేశమిచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనంతరం ఆయన కొద్దిసేపు అక్కడే నిలిచి అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఓటు ప్రక్రియ పూర్తయ్యిన తర్వాత ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ రాష్ట్ర ప్రజలు తప్పక ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలలో

# పోలింగ్ ఉత్సాహం.. కొన్ని చోట్ల ఉద్రిక్తతలు


(మొదటి పేజీ తరువాయి)


సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. 19వ డివిజన్‌లో బీజేపీ ఎమ్మెల్యే సూర్యనారాయణ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేకు అనుమతి ఇచ్చి తనను అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించగా, ఇరు పార్టీల అనుచరుల మధ్య వాగ్వాదం జరిగింది. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య నినాదాలు ఉద్రిక్తతకు దారితీశాయి. రాకాసిపేట్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులను దొంగ ఓట్లు వేయకుండా సిబ్బంది అడ్డుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 నెంబరు బూత్‌ల వద్ద తోపులాటలు చోటు చేసుకున్నాయి. 14వ వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఓటర్లను ప్రలోభపెడుతున్నారనే ఆరోపణలతో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుండగా, చెలరేగిన ఘటనలను పోలీసులు అదుపులోకి తీసుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు.

## 70% స్థానాల్లో కాంగ్రెస్ దూసుకెళ్తుందన్న

# పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఇవాళ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడైంది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగిందని పీపుల్స్ పల్స్ పేర్కొంది. కరీంనగర్, నిజమాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. నిజమాబాద్, కరీంనగర్, మహబుబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవు" అని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. "రామగుండంలో కాంగ్రెస్ 3034, బీఆర్ఎస్ 1620, బీజేపీ 36, ఇతరులు 47 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 3943, బీఆర్ఎస్ 812, బీజేపీ 69, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 2834, బీఆర్ఎస్ 79, సీపీఐ 1416, ఇతరులు 24 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది మహబుబ్‌నగర్‌లో కాంగ్రెస్ 2630, బీఆర్ఎస్ 1822, బీజేపీ 68, ఎంఐఎం 24, ఇతరులు 01 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 2126, బీఆర్ఎస్ 812, బీజేపీ 610, ఎంఐఎం 24, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నిజమాబాద్‌లో కాంగ్రెస్ 1016, బీఆర్ఎస్ 24, బీజేపీ 2631, ఎంఐఎం 812, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్‌లో కాంగ్రెస్ 1416, బీఆర్ఎస్ 1012, బీజేపీ 2429, ఎంఐఎం 69, ఇతరులు 13 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. 6876 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 2936 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 35 బీజేపీ, 01 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉంది. 814 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ ఉంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ 12101290, బీఆర్ఎస్ 860930, బీజేపీ 250270, ఏఐఎంఐఎం 3544, సీపీఐ 1217, సీపీఎం 1014, ఇతరులు 90110 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది" అని పీపుల్స్ పల్స్ వెల్లడించింది.

## అధికార దుర్వినియోగం

# దుర్మార్గం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదలుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. నామినేషన్ల దాఖలు నుంచి పోలింగ్ వరకు కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులను బెదిరించడమే కాకుండా, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ఆరోపించారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల వ్యవహారం గర్హనీయమని అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు దిగజారడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని స్పష్టం చేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్‌లకు అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# మీ డేటాను సైబర్ నేరగాళ్ల చేతుల్లో పెట్టొద్దు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**




ఆన్‌లైన్‌లో పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. అపరిచిత వెబ్‌సైట్లలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయకూడదని హెచ్చరించారు. మీరుచూసే ప్రతి వెబ్‌సైట్ సురక్షితమని భావించి సమాచారం ఇవ్వడం ప్రమాదకరమని పేర్కొన్నారు.

అధికారికంగా కనిపించే వెబ్‌సైట్లు కూడా నకిలీ అయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు, గోప్య సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఆఫర్లపై క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

మీ డేటా అంగట్లో పెట్టినట్లయితే సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పించినట్టేనని పోలీసులు హెచ్చరించారు. వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలంగాణ పోలీసులు సూచించారు.

# డిప్రెషన్ ఒక్కటే కారణం కాదు



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**

విజయశాంతి రెడ్డి మృతి కేసులో డిప్రెషన్ ఒక్కటే కారణమని ప్రచారంలో ఉన్న వార్తలను పోలీసులు ఖండించారు. ఆమె కేవలం మానసిక ఆందోళన కారణంగా ఆత్మహత్య చేసుకుందని చెప్పడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

రైల్వే పోలీసులు మాట్లాడుతూ, సూసైడ్‌కు డిప్రెషన్ మాత్రమే కారణం కాదని పేర్కొన్నారు. ఘటనకు దారితీసిన ఇతర అంశాలపై కూడా విచారణ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు కుటుంబ సభ్యులు సహా మొత్తం 12 మందిని విచారించినట్లు తెలిపారు.

ఆఫీసులో ఆమెతో కలిసి పనిచేసిన సహోద్యోగుల వాంగ్మూలాలను కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. వ్యక్తిగత, వృత్తి సంబంధిత అంశాలను పరిశీలిస్తూ దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత కేసులోని చిక్కుముడి వీడే అవకాశముందని పోలీసులు తెలిపారు. అన్ని ఆధారాలను పరిశీలించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.




# ఎల్కతుర్తి మండలంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల దౌర్జన్యం

- రాత్రి వేళల్లో వసూళ్లు, బెదిరింపులతో ఆందోళన

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల అనుచిత ప్రవర్తన తీవ్ర ఆందోళనకు దారితీసింది. రుణ వాయిదాల వసూళ్ల పేరుతో సోమవారం రాత్రి ఆలస్యంగా కస్టమర్ల ఇళ్లకు వెళ్లిన సంస్థ సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బాధితుల వివరాల ప్రకారం, రాత్రి 9 గంటల తర్వాత ఇళ్లకు చేరుకున్న సిబ్బంది మహిళలు, కుటుంబ సభ్యుల సమక్షంలో అవమానకరంగా మాట్లాడి మానసిక ఒత్తిడికి గురిచేశారని తెలిపారు. అసభ్య పదజాలంతో బెదిరింపులకు పాల్పడినట్లు వారు వాపోతున్నారు.

అంతేకాకుండా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తూ ఒత్తిడి తెచ్చినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో వసూళ్లు చేయడం చట్టవిరుద్ధమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై సంబంధిత అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లి, మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి వేళ వసూళ్లపై స్పష్టమైన నిషేధం అమలు చేయాలని కోరుతున్నారు.



# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు.. ఈసారి వీఐపీ పాస్‌లు లేవు

- ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన డిజిపి శ్రీధర్, జోనల్ కమిషనర్ గంగ్వార్

**కీసర, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఈనెల 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాల నిర్వహణపై డిజిపి శ్రీధర్, జోనల్ కమిషనర్ గంగ్వార్ బుధవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.మహాశివరాత్రి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు స్వామివారి దర్శనం సాఫీగా జరిగేలా ప్రత్యేక క్యూ లైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు పార్కింగ్ స్థలాలను గుర్తించి వాహనాల రాకపోకలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం ఈసారి వాహనాలకు ఎలాంటి వీఐపీ పాస్‌లు జారీ చేయడం లేదని అధికారులు స్పష్టం చేశారు. అందరికీ సమాన అవకాశంతో దర్శనం కల్పించడమే లక్ష్యమని తెలిపారు.భక్తులకు తాగునీరు, శానిటేషన్, వైద్య సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.ఈ పరిశీలనలో ఆలయ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఈఓ కట్ట సుధాకర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



# మోజర్ల గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మోజర్ల సర్పంచ్ కె. చంద్రశేఖర్

**పెద్దమందడి,ఫిబ్రవరి11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి గ్రామసభ విజయవంతంగా ముగిసింది.గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సభలో విస్తృతంగా చర్చించి, గ్రామస్తుల ఏకగ్రీవ ఆమోదంతో తీర్మానాలు చేయడం జరిగింది.గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా కానాయపల్లి విష్ణు ఇంటి నుండి సాకలి శంకరమ్మ ఇంటి వరకు అండర్ డ్రైనేజీ నిర్మాణం, పోతుల రాములు ఇంటి నుండి విఐపి సమస్త పొలం వరకు డ్రైనేజీ నిర్మాణం, కానాయపల్లి లక్ష్మయ్య ఇంటి వెనుక నుండి నాగులకుంట వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు.అలాగే ముదిరాజు బిల్డింగ్ నుంచి మార్చ శాంతన్న ట్రాన్స్‌ఫార్మర్ వరకు, వాల్దాస్ నరేష్‌గౌడ్ ఇంటి నుంచి జంగిడి నాగాలక్ష్మి ఇంటి వెనుక వరకు, బాండెడ్ లేబర్ కాలనీలో భూపని మన్యం ఇంటి నుండి ఎర్ర కాలువ వరకు అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.గ్రామంలోని అన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ భద్రతార్థం ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కూడా గ్రామసభలో నిర్ణయం తీసుకున్నారు.గ్రామాభివృద్ధి దిశగా తీసుకున్న ఈ తీర్మానాలకు సహకరించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ కె. చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో మోజర్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.





# ఆశా వర్కర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి

- ఆన్లైన్ టార్గెట్ల పేరుతో వేధింపులు ఆపాలి – సీఐటీయూ

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా యు.పి.హెచ్.సి/పి.హెచ్.సి కేంద్రాల్లో ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ, జనవరి నెల వేతనాలు కొందరికి మాత్రమే చెల్లించగా, మిగిలిన వారికి ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. వేతనాల గురించి ప్రశ్నిస్తే “ప్రభుత్వం వద్ద నిధులు లేవు, నిధులు వచ్చిన తర్వాత ఇస్తాం” అని అధికారులు సమాధానం చెబుతున్నారని విమర్శించారు. జిల్లాలో మొత్తం 1270 మంది ఆశా వర్కర్లు ఉన్నప్పటికీ కొందరికి మాత్రమే వేతనాలు చెల్లించడం సరికాదని ప్రశ్నించారు.రూ.9,700 మాత్రమే జీతంగా పొందుతున్న ఆశా వర్కర్లకు వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని చెప్పడం అన్యాయమని అన్నారు. అదేవిధంగా ఆన్లైన్ పనుల పేరుతో రోజుకు 50-100 టార్గెట్లు పెట్టి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఆశా వర్కర్లు ఏఎన్ఎం అకౌంట్‌లో లాగిన్ అయి ఆన్లైన్ పనులు చేస్తున్నప్పటికీ, టార్గెట్ పూర్తి చేయకపోతే దుర్భాషలాడటం, బెదిరింపులు చేయడం, రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం జరుగుతోందని తెలిపారు.ఈ చర్యలను సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని, ఆశా వర్కర్లపై వేధింపులు ఆపకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి నేడు జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలోని కుషాయిగూడ, ఉప్పల్, బాలానగర్, శ్రీరంగవరం, మల్కాజిగిరి, జవహర్‌నగర్, దిడిగల్, కీసర, రామంతాపూర్, కొత్తపేట, జగద్గిరిగుట్ట, హస్మత్‌పేట, అంబేద్కర్‌నగర్, చీరాలపల్లి, మల్లాపూర్ తదితర పిహెచ్‌సీలలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు.





# సత్తుపల్లి-కల్లూరులో అధికార పోరు:13న తేలనున్న పీఠం

- ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్.
- జిల్లాలో కల్లూరులోనే అత్యధిక శాతం నమోదు.

**సత్తుపల్లి/కల్లూరు, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూల్లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో మొత్తం 28,830 మంది ఓటర్లలో 22,326 మంది ఓటు వేశారు. దీంతో 77.44 శాతం పోలింగ్ నమోదైంది. కల్లూరు మున్సిపాలిటీలో 18,866 మంది ఓటర్లలో 16,408 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 86.97 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోనే అత్యధిక పోలింగ్ శాతం కల్లూరులో నమోదవడం విశేషం.

సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కూడా కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించగా, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అధికార పీఠం ఎవరిని వరించనుందో అన్న ఉత్కంఠ పట్టణాల్లో నెలకొంది. రాజకీయ వర్గాలు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



# నేరెడ్‌మెట్ డివిజన్‌లో 5 సంవత్సరాల అభివృద్ధి స్వర్ణయుగం

- రూ.168 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి
- రోడ్లు, డ్రైనేజీలు, థీమ్ పార్కులు, శ్మశానవాటికలు, వీధి దీపాలు

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం నేరెడ్‌మెట్ 136వ డివిజన్ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో డివిజన్ అభివృద్ధి విశేషాలను వెల్లడించారు. కార్పొరేటర్ వెల్లడించారు.ఈ 5 సంవత్సరాలు నేరెడ్‌మెట్ మరియు యాప్రాల్ ప్రాంతాల అభివృద్ధి చరిత్రలో స్వర్ణయుగంగా నిలుస్తాయి. రికార్డు స్థాయిలో రూ.168 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగింది. మాటలు కాదు, పనులతోనే ప్రజల విశ్వాసం గెలిచాం."మౌలిక సదుపాయాలపై రూ.108 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, థీమ్ పార్కులు, కమ్యూనిటీ హాల్స్, శ్మశానవాటికలు, వీధి దీపాలు వంటి పనులు చేపట్టబడ్డాయి. బాక్స్ డ్రెయిన్స్ నిర్మాణానికి రూ.53 కోట్లు ఖర్చు చేశారు:యాప్రాల్: నాగి చెరువు నుండి కాప్రా చెరువు - రూ.43 కోట్లు,ఎంప్లాయిస్ కాలనీ - రూ.6 కోట్లు అందాల్ హోమ్స్ - రూ.2 కోట్లు బ్యాంక్ కాలనీ - రూ.3 కోట్లు ఆర్ కే పురం చెరువు సుందరీకరణకు రూ.6 కోట్లు, నేరెడ్‌మెట్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌కు రూ.1 కోటి, భద్రత కోసం రూ.30 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ చెప్పారు, "మా డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సిఫారసుల ద్వారా దాదాపు రూ.4.16 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు చేయించాం. ఇందులో శ్మశానవాటిక అభివృద్ధి, కొత్త బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రధానంగా ఉన్నాయి."పార్టీ భేదాలను మానేసి ప్రతి కాలనీకి సమాన అభివృద్ధి అందించామని, డివిజన్‌లో సగానికి పైగా కాలనీల్లో 100% మౌలిక సదుపాయాలు కల్పించారని, మొత్తం 60-70% పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.కొత్త ప్రతిపాదనలను రూ.15-20 కోట్ల విలువలో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ , జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కి సమర్పించినట్లు ప్రకటించారు.కొతపల్లి మీనా ఉపేంద్రరెడ్డి చివరగా, "ఈ 5 సంవత్సరాలు మాకు అండగా నిలిచిన ప్రతి కాలనీ అధ్యక్షుడు, సభ్యులు, అధికార యంత్రాంగం, మీడియా మిత్రులు మరియు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. పదవి ముగిసినా, నేరెడ్‌మెట్ మరియు యాప్రాల్ అభివృద్ధి కోసం సేవ ఎప్పటికీ ఆగదు," అన్నారు.



# ఎడిషన్, డార్విన్ జయంతి సందర్భంగా వైజ్ఞానిక నీరాజనం

- స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహణ

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ కార్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్తలు థామస్ ఆల్వా ఎడిషన్, చార్లెస్ డార్విన్ జయంతి సందర్భంగా వైజ్ఞానిక నీరాజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి విద్యావేత్త అనురాధ, చార్లెస్ డార్విన్ చిత్రపటానికి సోషల్ మీడియా ప్రముఖులు ఎం. భాస్కరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, ఎడిషన్ 179వ జయంతి,డార్విన్ 217వ జయంతి సందర్భంగా వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. ఎన్నో విఫల ప్రయత్నాల మధ్య పట్టుదలతో కృషి చేసి ప్రపంచానికి వెలుగులు నింపిన మహనీయుడు ఎడిషన్ అని పేర్కొన్నారు. డార్విన్ మానవ పరిణామ క్రమాన్ని శాస్త్రీయ ఆధారాలతో ప్రపంచానికి పరిచయం చేసి విజ్ఞాన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు.సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ, శాస్త్రవేత్తల ఆవిష్కరణల వల్లే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం అత్యవసరమని, మూఢనమ్మకాల వ్యతిరేకంగా సమాజం చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. ఎం. భాస్కరరావు మాట్లాడుతూ, ఎడిషన్ బల్బుతో పాటు టెలిగ్రాఫ్ సహా అనేక ఆవిష్కరణలకు పేటెంట్లు సాధించారని తెలిపారు. డార్విన్ తన సిద్ధాంతాల కోసం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ ధైర్యంగా నిలబడ్డారని అన్నారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక ఆలోచనలను పెంపొందించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు.విద్యావేత్త అనురాధ మాట్లాడుతూ, ఎడిషన్ పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం సభ్యులందరూ శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, ఉన్ని కృష్ణన్, శోభ, గౌసియా, పి. మల్లేశం, వెంకటేశ్వర రావు, శారద, రుక్కయ్య, గిరీష్, శివరామకృష్ణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మేడ్చల్–మల్కాజిగిరిలో
# ప్రశాంతంగా పోలింగ్





◆ పోలింగ్ బూతులను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపాలిటీలూ, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బుధవారం పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి, సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీతో కలిసి సందర్శించి పరిశీలించారు.ఆలియాబాదు జిల్లా పరిషత్ హైస్కూల్, మూడుచింతల పల్లి మండలం జగ్గన్‌గూడ జిల్లా పరిషత్ హైస్కూల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ రాజ బొల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులను వారు తనిఖీ చేశారు. ఓటింగ్ ప్రక్రియను సమీక్షిస్తూ ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారో ప్రిసైడింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, వీల్‌చైర్ సౌకర్యం, తాగునీరు, విద్యుత్ మరియు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించి, అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఓటు వేయడానికి వీల్‌చైర్‌లో వచ్చిన కిష్టమ్మ (65)ను కలెక్టర్ మను చౌదరి ఆప్యాయంగా పలకరించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేయగా, అధికారులు అభినందించారు. ప్రజలు పెద్దఎత్తున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు పిలుపునిచ్చారు.

# వనపర్తి జిల్లాలో 5 మున్సిపాలిటీల ఎన్నికలు ప్రశాంతంగా ముగింపు

◆ 75.56 శాతం పోలింగ్ నమోదు
◆ కట్టుదిట్టమైన బందోబస్తులో స్ట్రాంగ్ రూములకు ఈవీఎంల తరలింపు

**నపర్తి,ఫిబ్రవరి11(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. జిల్లాలో మొత్తం 88,738 ఓట్లు పోల్ కాగా 75.56 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.మున్సిపాలిటీ వారీగా చూస్తే వనపర్తిలో 45,904 ఓట్లు పోలై 71.51 శాతం, కొత్తకోటలో 14,319 ఓట్లు పోలై 78.71 శాతం, పెబ్బేరు లో 11,912 ఓట్లు పోలై 83.11 శాతం, ఆత్మకూరులో 8,958 ఓట్లు పోలై 77.36 శాతం, అమరచింతలో 7,645 ఓట్లు పోలై 83.58 శాతం నమోదైనట్లు తెలిపారు.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు లక్ష్మిబాయి, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ కలిసి పర్యవేక్షించారు.పోలింగ్ ప్రారంభమైన వెంటనే కలెక్టర్ వనపర్తి మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు మర్రికుంట పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 23, 15వ వార్డుల పోలింగ్ కేంద్రాలు, హరిజనవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 19, 21వ వార్డుల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.మర్రికుంట మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడిన కలెక్టర్, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ కట్టుదిట్టమైన శాంతిభద్రతలు అమలు చేసినట్లు తెలిపారు. పోలైన ఓట్లను పకడ్బందీ పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నట్లు వెల్లడించారు.



## జాతీయ ఓడరేవుల నియామక పరీక్షలో
### నాగులవంచ యువకుడి ప్రతిభ...

### సివిల్ ఇంజనీరింగ్‌లో దేశవ్యాప్తంగా 5వ ర్యాంక్...



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన షేక్ సలీం జాతీయ స్థాయిలో నిర్వహించిన భారత ఓడరేవుల (పోర్ట్స్ అథారిటీ) సివిల్ ఇంజనీరింగ్ నియామక పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా 5వ ర్యాంక్ సాధించాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో (హాల్ టికెట్ నెంబర్ : ఐపి 525007943) 160 మార్కులకు గాను 146.25 మార్కులు సాధించి ఈ ఘనతను అందుకున్నాడు.

దేశవ్యాప్తంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 14 పోస్టులు భర్తీ చేయగా, అందులో 9 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 5 అసిస్టెంట్ మేనేజర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & ఫెసిలిటీస్) పోస్టులు ఉన్నాయి. వీటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుకు సలీం అర్హత సాధించాడు. ఈ నియామక పరీక్ష 2025 డిసెంబర్ 2న నిర్వహించబడింది.

2002 జనవరి 2న జన్మించిన సలీం, 1 నుంచి 10వ తరగతి వరకు ఖమ్మంలోని కేంద్రీయ విద్యాలయంలో చదివాడు. అనంతరం న్యూ విజన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 2020లో 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి తెలంగాణలో 5వ ర్యాంక్ పొందాడు. తర్వాత ఎన్ఐటీ వరంగల్‌లో సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్‌ను 2024లో పూర్తి చేశాడు.

భవిష్యత్తులో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐ ఇఎస్) సాధించడమే తన లక్ష్యమని సలీం తెలిపారు. అతని తండ్రి నాగుల్ మీరా ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మామిళ్లగూడెంలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.తమ గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల నాగులవంచ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సలీంను అభినందించారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఐదో వార్డు అభ్యర్థి ఎన్ యుగేందర్ రెడ్డి



**వడ్డేపల్లి,ఫిబ్రవరి11(తెలంగాణ ముచ్చట్లు) :** వడ్డేపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఎన్ యుగేందర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కు అమూల్యమైనదని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ సూచించిన మార్గంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున ముందుకు వచ్చి తమ హక్కును చాటుకోవాలని పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించిన సిబ్బంది శాంతి భద్రతలు కాపాడుతూ కృషి చేయడంతో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కీసర, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఫీడర్ నిర్వహణ మరియు పిఎంఐ పనుల నేపథ్యంలో కీసర పరిధిలోని కొన్ని ఫీడర్లలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం, కీసర సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కె.వి వర్ధన ఫీడర్‌లో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ సమయంలో పాత కలెక్టర్ కార్యాలయం పరిధి ప్రాంతాలు ప్రభావితమవుతాయి. అలాగే రాంపల్లి సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కెవి కరీంగూడ ఫీడర్‌లో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ క్రమంలో కరీంగూడ గ్రామం, శిల్పా వెంచర్, తారక ఎన్‌క్లేవ్, కాకతీయ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, సాహితి హర హర, లోటస్ కౌంటీ, సాయి కాలనీ, చంద్ర ఎన్‌క్లేవ్, రాజిరెడ్డి ఎన్‌క్లేవ్, మైత్రి నగర్, భగవాన్ కాలనీ, గ్రీన్ సిటీ, నక్షత్ర ఎన్‌క్లేవ్, లెజెండ్ కాలనీ, నీలగిరి ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ ఎస్. మురళీ కృష్ణ సూచించారు.



## నాగిలిగొండ గ్రామంలో పశు వైద్య శిబిరం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశువైద్యాధికారి రూప కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతులకు పశు పోషణ గురించి అయన వివరించారు. అనంతరం పశువులకు నత్తల నివారణ కోసం ఇంజక్షన్లు వేశారు. 42 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ, ఉప సర్పంచ్ చాట్ల శ్యామల,మండల పశు వైద్యాధికారి రాంజీ, సిబ్బంది నవీన్ కుమార్, రజిని, మాజీ ఎంపీటీసీ సభ్యులు పదిమల వెంకట నరసయ్య, గ్రామ పెద్దలు ఎస్కే హుస్సేన్ చాట్ల రమేష్,గోపాల్ మిత్ర సభ్యులు, రైతులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇన్స్పైర్ జూనియర్ కాలేజీలో ఘనంగా వీడ్కోలు సమావేశం

**హసన్ పర్తి,ఫిబ్రవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలోని ఎంటిర్ ఫంక్షన్ హాల్‌లో ఇన్స్పైర్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మెన్ తీగల భరత్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన,ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు.విద్యార్థులు లక్ష్య సాధన దిశగా నిరంతరం కృషి చేస్తూ ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే తప్పకుండా విజయం సాధించగలరని అన్నారు. ఇన్స్పైర్ జూనియర్ కాలేజీ లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకొని పట్టుదలతో చదువుకుంటే తప్పకుండా విజయం సాధించగలరని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి శ్రీరాం రెడ్డి,డైరెక్టర్లు తీగల రాజకుమార్,కోటిచింతల మమత కుమారి,లాడే శివ,కళాశాల అధ్యాపకులు (లెక్చరర్లు) పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.వీడ్కోలు సమావేశం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్‌తో కట్టుదిట్టమైన ఏర్పాట్లు


**మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహణకు చర్యలు: కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అత్యంత సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి, ఓటింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతా బలగాలను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చి, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ మను చౌదరి కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# రుద్రరమేశ్వర శివాలయంలో నూతన సర్పంచులకు ఘన సన్మానం



**వేలేరు,ఫిబ్రవరి11(తెలంగాణ ముచ్చట్లు) :** వేలేరు మండలంలోని ప్రసిద్ధ రుద్రరమేశ్వర శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల వేదిక అధ్యక్షుడు బిల్లా యాదగిరి, శాలపల్లి గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్‌లను ఆలయ కమిటీ సభ్యులు, శివభక్తులు సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో సర్పంచులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. అనంతరం శివభక్తుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, సంపత్, రవి, శివమాలధారులు తదితరులు పాల్గొన్నారు.


# అస్సాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న ప్రధాని నరేంద్ర మోదీ



- **ఫిబ్రవరి 14న అస్సాం పర్యటన**
- **డిబ్రుగఢ్ జిల్లాలో జాతీయ రహదారిపై అత్యవసర విమాన దిగుబడి పట్టీ వినియోగం**
- **ఈశాన్య ప్రాంతంలో తొలి రహదారి ఆధారిత విమాన సదుపాయం**

ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరి 14న అస్సాం రాష్ట్రాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా డిబ్రుగఢ్ జిల్లా పరిధిలోని చాబువా ప్రాంతంలో డిబ్రుగఢ్-మోరాన్ జాతీయ రహదారి మార్గంపై నిర్మించిన అత్యవసర విమాన దిగుబడి పట్టీపై ప్రధాని ప్రయాణించే విమానం దిగడం, తిరిగి ఎగిరిపోవడం జరగనుంది. ఈశాన్య భారతదేశంలో రహదారి ఆధారంగా నిర్మించిన తొలి అత్యవసర విమాన సదుపాయం ఇదే కావడం విశేషం. రక్షణ అవసరాలు, విపత్తు నిర్వహణ వంటి సందర్భాల్లో ఈ దిగుబడి పట్టీ ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. ఈశాన్య ప్రాంత మౌలిక వసతుల అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రధాని పర్యటనతో అస్సాంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభించనుందని ప్రభుత్వం పేర్కొంది.

# థాయ్ రాజ వాయుసేన సంయుక్త గగన విన్యాసాలు



**కార్యాచరణ సమన్వయం, పరస్పర అనుసంధానం పెంపే లక్ష్యం**

**సుఖోయ్ యుద్ధవిమానాలు, గగన హెచ్చరిక వ్యవస్థల పాల్గొనడం**

**భారత–థాయ్ రక్షణ సహకారానికి మరింత బలం**

భారత వాయుసేన మరియు థాయ్ రాజ వాయుసేన సంయుక్తంగా ప్రత్యక్ష స్థల గగన విన్యాసాలను నిర్వహిస్తున్నాయి. ఈ విన్యాసాల ద్వారా ఇరు వాయుసేనల మధ్య కార్యాచరణ సమన్వయం, పరస్పర అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. ఈ విన్యాసాల్లో భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ ముప్పై ఎం కే ఐ యుద్ధవిమానాలు, గగన హెచ్చరిక మరియు నియంత్రణ వ్యవస్థల విమానాలు, గగన ముందస్తు హెచ్చరిక విమానాలు, గగన ఇంధన నింపే విమానాలు పాల్గొంటున్నాయి. థాయ్ రాజ వాయుసేనకు చెందిన గ్రిపెన్ యుద్ధవిమానాలు కూడా ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమవుతున్నాయి.

ఇరు దేశాల మధ్య రక్షణ రంగంలో సహకారం మరింత బలపడేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంత భద్రత, సముద్ర రక్షణ పరిరక్షణలో పరస్పర అవగాహన పెంపుకు ఇవి ఉపకరిస్తాయని వివరించారు.

భారత-థాయ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రాంతీయ సమన్వయానికి ఈ సంయుక్త గగన విన్యాసాలు కీలకంగా నిలవనున్నాయని రక్షణ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి.

# ప్రజా పంపిణీ బియ్యం నాణ్యతపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ డా. కడియం కావ్య



**వరంగల్,ఫిబ్రవరి11(తెలంగాణ ముచ్చట్లు) :** లోక్‌సభలో తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న బియ్యం నాణ్యతపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. గత మూడేళ్లుగా బియ్యం నాణ్యతపై అందిన ఫిర్యాదుల వివరాలు, కేంద్ర సంస్థలు నిర్వహించిన తనిఖీలు, లోపాలు తలెత్తిన పక్షంలో తీసుకున్న చర్యలు, సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో పారదర్శకత కోసం చేపట్టిన చర్యలపై సమగ్ర వివరణ కోరారు.ఈ ప్రశ్నకు స్పందించిన కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తెలంగాణలో గత మూడేళ్లలోను, ప్రస్తుత సంవత్సరంలోను బియ్యం నాణ్యతపై ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని సభలో స్పష్టం చేశారు. తెలంగాణ వికేంద్రీకృత ధాన్య కొనుగోలు రాష్ట్రంగా ఉండటంతో, రాష్ట్ర ప్రభుత్వమే నూరుశాతం నాణ్యత తనిఖీలు నిర్వహించి ధాన్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసి, కేంద్ర ప్రమాణాల ప్రకారం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తోందని వివరించారు.

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త బృందాలు నిల్వ కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీల్లో 2022-23లో 542, 2023-24లో 380, 2024-25లో 482, 2025-26లో జనవరి వరకు 268 తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఏ దశలోనూ మానవ వినియోగానికి అనర్హమైన ధాన్యం గుర్తించలేదని వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నాణ్యత, పారదర్శకత పెంపు కోసం విజిలెన్స్ కమిటీలు, ఈపాస్ యంత్రాలు, ఆధార్ ఆధారిత పంపిణీ విధానం, అంతర్జాల ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, 'మేరా రేషన్' అనువర్తనం అమలులో ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. వరంగల్ ఎంపీ లేవనెత్తిన ప్రశ్నతో ప్రజా పంపిణీ వ్యవస్థపై పార్లమెంట్ దృష్టి కేంద్రీకృతమైందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

# ప్రగతినగర్ చెరువు ప్రగతికి హైడ్రా కృషి

- **చెత్త వేయకుండా కిలోమీటరు నర మేర ఎత్తైన కంచె**
- **జంతు వ్యర్థాల తొలగింపుతో దుర్వాసన తగ్గింపు**
- **ఆక్రమణల తొలగింపుతో రాకపోకలు సులభం**





**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రగతినగర్ అంబీర్ చెరువు అభివృద్ధి కోసం హైడ్రా సంస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. చెరువులో దుర్గంధం వెదజల్లుతున్న పూడికను ఇటీవల తొలగించిన అధికారులు, ఇప్పుడు చెత్త వేయకుండా రహదారి పొడవునా కంచె ఏర్పాటు చేశారు. చెరువు మధ్యలో ఉన్న రహదారి ఇరువైపులా చికెన్, మాంసం, చేపల విక్రేతలతో పాటు ఇతర దుకాణదారులు జంతు వ్యర్థాలను పడేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు ముందుగా అక్కడ పేరుకుపోయిన జంతు వ్యర్థాలను తొలగించారు. సుమారు 145 లారీల చెత్తను క్లియర్ చేసి, వ్యర్థాలు వేస్తున్న దుకాణదారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించి ఖాళీ చేయించారు.

చెరువు మధ్యలో ఉన్న రహదారి మార్గాన ప్రయాణిస్తూ చెత్త విసిరేయకుండా 10 మీటర్ల ఎత్తులో కంచె వేశారు. కిలోమీటరు నర మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వ్యర్థాలు చెరువులో పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చెరువులో మురుగు నీరు కలవకుండా అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి, ప్రగతినగర్ ప్రాంతాలను కలుపుతూ చెరువు మధ్యలోంచి వెళ్లే రహదారిపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడంతో లక్షలాది మంది స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గి రాకపోకలు సులభమయ్యాయని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో దుర్వాసన తగ్గిందన్నారు. ఒకప్పుడు పక్షుల కిలకిలారావాలతో, వలస పక్షుల సందర్శనతో ఆహ్లాదకరంగా ఉన్న ప్రగతినగర్ అంబీర్ చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. చెరువులో ఉన్న పూడికను పూర్తిగా తొలగించి, మురుగు నీటిని మళ్లించి, శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి, సమగ్ర అభివృద్ధి చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నగరంలో ఇతర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల మాదిరిగానే ఈ చెరువుకు కూడా రూపురేఖలు మార్చాలని హైడ్రాకు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

# అనారోగ్యంతో ఉన్న లక్ష్మీనర్సింహచారిని పరామర్శించిన కల్వకుంట్ల కవిత





- **ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్చన సేనాపతి భర్తను కలిసి ధైర్యం చెప్పిన జాగృతి అధ్యక్షురాలు**
- **ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న కవిత**
- **త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అర్చన సేనాపతి భర్త లక్ష్మీనర్సింహచారిని కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడిన కవిత, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆసుపత్రికి చేరుకుని లక్ష్మీనర్సింహచారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ మద్దతు తెలిపారు.

# కారులో ముగ్గురి హత్య కేసు ఛేదన

దేశ రాజధాని న్యూఢిల్లీలో కారులో ముగ్గురు మృతదేహాలు లభించిన కేసును పోలీసులు ఛేదించారు. తొలుత ఇది ఆత్మహత్యగా అనుమానించినా, దర్యాప్తులో అది పక్కా హత్య అని తేల్చారు. విషం కలిపిన లడ్డూలు ఇచ్చి ముగ్గురిని హత్య చేసిన బాబాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 8న పీరాగఢి పైవంతెనపై నిలిపిన కారులో ముగ్గురు వ్యక్తులు మృతిచెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రారంభంలో ఆత్మహత్యగా భావించినా, కుటుంబ సభ్యులు ఆ అనుమానాన్ని తోసిపుచ్చడంతో పోలీసులు కోణం మార్చి విచారణ చేపట్టారు. మృతులను నంగ్లీ డెయిరీ ప్రాంతానికి చెందిన 76 ఏళ్ల రణధీర్, బాప్రోలా ప్రాంతానికి చెందిన 42 ఏళ్ల శివ నరేష్, జహంగీర్‌పురికి చెందిన 40 ఏళ్ల లక్ష్మీగా గుర్తించారు. దర్యాప్తులో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన కమ్రుద్దీన్ అనే వ్యక్తి లోని ప్రాంతంలో తాంత్రిక కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. 'ధన్‌వర్ష్' పూజలతో డబ్బు రెండుమూడింతలు అవుతుందని నమ్మించి అమాయకులను ఆకర్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం లక్ష్మీ అతడిని కలవగా, అనంతరం శివ నరేష్, రణధీర్‌లను కూడా పరిచయం చేసినట్లు వెల్లడైంది. ఫిబ్రవరి 7న ముగ్గురు కమ్రుద్దీన్‌ను కలవగా, రూ.2 లక్షల నగదు, మద్యం, శీతల పానీయాలు తీసుకురావాలని చెప్పాడు. మరుసటి రోజు వారు కారులో వెళ్లగా, పూజ అనంతరం విషం కలిపిన లడ్డూలు, మద్యం, శీతల పానీయాలు ఇచ్చాడు. అవి సేవించిన తర్వాత ముగ్గురు స్పృహ కోల్పోగా, వారి వద్ద ఉన్న రూ.2 లక్షలు తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# సంక్షోభంలో చిన్న పరిశ్రమలు

- ఆర్థిక ఒత్తిళ్లు.. మూతపడుతున్న యూనిట్లు
- బ్యాంకు రుణాలు – అందని ద్రాక్షలా మారుతున్నాయా?
- ఉపాధి అవకాశాలపై ప్రభావం ఎంత?





**డెస్క్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే చిన్న పరిశ్రమలు ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. తయారీ, సేవా రంగాల్లో వేలాది యూనిట్లు ఆర్థిక ఒత్తిళ్లతో నెట్టుకొస్తున్నాయి. మార్కెట్ పోటీ పెరగడం, అమ్మకాలు తగ్గడం, ఖర్చులు అధికమవడం వంటి కారణాలతో కొన్ని యూనిట్లు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఇది కేవలం వ్యాపార సమస్యగా కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది.

బ్యాంకు రుణాలు - అందని ద్రాక్షలా మారుతున్నాయా?

చిన్న పరిశ్రమలకు మూలధనం అత్యవసరం. కానీ బ్యాంకు రుణాలు పొందడం కష్టతరమవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గట్టి అర్హత ప్రమాణాలు, తగిన భద్రతా పత్రాల అవసరం చిన్న వ్యాపారులను వెనుకడుగు వేయిస్తోంది. రుణాల మంజూరు ఆలస్యం కూడా యూనిట్ల పనితీరుపై ప్రభావం చూపుతోంది. ఫలితంగా అనేక సంస్థలు అధిక వడ్డీపై ప్రైవేట్ రుణాలవైపు మొగ్గుచూపుతున్నాయి.

ముడిసరుకు ధరల పెరుగుదల - లాభాలు కరుగుతున్నాయా?

ముడిసరుకు ధరలు, రవాణా ఖర్చులు, విద్యుత్ చార్జీలు పెరగడం చిన్న పరిశ్రమలపై అదనపు భారంగా మారింది. ఉత్పత్తి వ్యయం పెరిగినా, మార్కెట్‌లో ధరలను పెంచలేని పరిస్థితి ఉంది. ఫలితంగా లాభాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఇది సంస్థల నిలకడను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న యూనిట్లు ఈ ఒత్తిడిని మరింతగా ఎదుర్కొంటున్నాయి.

ఉపాధి అవకాశాలపై ప్రభావం ఎంత?

చిన్న పరిశ్రమలు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగం బలహీనమైతే ఉపాధి అవకాశాలు కూడా తగ్గే ప్రమాదం ఉంది. యువతకు స్థానిక స్థాయిలో ఉపాధి అందించే ఈ రంగం కుదేలైతే, నిరుద్యోగం సమస్య మరింత తీవ్రం కావచ్చు. అందుకే చిన్న పరిశ్రమల స్థిరత్వం దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం.

చిన్న పరిశ్రమలు కేవలం వ్యాపార యూనిట్లు మాత్రమే కావు. ఇవి దేశ ఆర్థిక నిర్మాణానికి పునాది. సరైన విధానాలు, సకాలంలో రుణాలు, ముడిసరుకు ధరల నియంత్రణ, మార్కెట్ మద్దతు లభిస్తే ఈ రంగం మళ్లీ బలోపేతం కావచ్చు. చిన్న పరిశ్రమల సంక్షోభాన్ని పరిష్కరించడం అంటే దేశ ఉపాధి భవిష్యత్తును కాపాడుకోవడమే.

## మున్సిపల్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ – 90 శాతం స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకి: మహేష్ కుమార్ గౌడ్

- పట్టణ ఓటర్ల మద్దతుతో ఘన విజయం సాధించబోతున్నామని ధీమా
- ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకే ప్రజల పట్టం
- పారదర్శక పరిపాలనపై విశ్వాసమే విజయానికి కారణమని వ్యాఖ్య




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించబోతోందని తెలిపారు.


ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబాటు కాంగ్రెస్ పట్ల విశ్వాసాన్ని బలపరిచాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై తీసుకున్న చర్యలు సానుకూల ప్రభావం చూపాయని తెలిపారు.


ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు బాధ్యతను మరింత పెంచిందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వమనే నమ్మకాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులు, అభ్యర్థులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. పట్టణాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్, ఖానామెట్‌లో రూ.1003 కోట్ల ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా

- పార్కు స్థలంపై 150 గజాల ఆక్రమణ తొలగింపు
- ఖానామెట్‌లో 5 ఎకరాలకు కంచె వేసి రక్షణ
- కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాలతో చర్యలు







**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్, ఖానామెట్ ప్రాంతాల్లో భారీ విలువ కలిగిన ప్రభుత్వ భూములను హైడ్రా అధికారులు కాపాడారు. మొత్తం రూ.1003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని ఆక్రమణల నుంచి రక్షించినట్లు తెలిపారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి బుధవారం చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న సుమారు రెండు ఎకరాల పార్కులో 150 గజాల మేర ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించారు. లేడీస్ హాస్టల్ నడుపుతున్న కిరాయిదారుడు పార్కులోకి సుమారు 50 గజాలు చొచ్చుకెళ్లి మూడంతస్తుల నిర్మాణం చేపట్టడంతో పాటు, మరో 100 గజాలను హద్దులు వేసుకుని సొంత వినియోగానికి మార్చుకున్నట్లు గుర్తించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించి, మూడంతస్తుల నిర్మాణాన్ని కూల్చివేసి పార్కుకు కంచె వేశారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇక హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రానికి సమీపంలోని ఖానామెట్‌లో ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిపై కూడా ఆక్రమణ ప్రయత్నాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భూమి విలువ సుమారు వెయ్యి కోట్లకు పైగా ఉంటుందని అంచనా. కోర్టు స్టే ఉన్న నేపథ్యంలో వెనుక వైపు నుంచి మట్టి పోసి భూమిని కబ్జా చేస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో హైడ్రా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలకు అవకాశం లేకుండా ఐదు ఎకరాల మేర కంచె వేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజా వాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణ స్పందన చూపి ప్రభుత్వ భూములను రక్షించడం తమ బాధ్యత అని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ప్రజా ఆస్తులను కాపాడేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## సమయ సద్వినియోగమే దేశ అభివృద్ధికి బలమైన పునాది



**డెస్క్, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత వంటి అంశాలు ముందుకు వస్తాయి. అయితే వీటన్నింటికీ ప్రాణం పోసేది ఉత్పాదకత. తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలు సాధించే సామర్థ్యమే నిజమైన ఉత్పాదకత. ఈ విలువను గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జాతీయ ఉత్పాదకత దినాన్ని పాటిస్తున్నారు. పని సామర్థ్యాన్ని పెంచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, దేశ అభివృద్ధిలో ప్రతి వ్యక్తి పాత్రను గుర్తు చేసే రోజు ఇది.


ఉత్పాదకత అనేది కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు. కార్యాలయాల్లో, వ్యవసాయ రంగంలో, విద్యాసంస్థల్లో, చిన్న వ్యాపారాల్లో ప్రతి రంగంలో ఇది కీలక అంశం. సమయపాలన, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, సాంకేతికత వినియోగం కలిసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. ఒక వ్యక్తి పనితీరు మెరుగుపడితే, అది సంస్థకు లాభం. సంస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు. పరిశ్రమల దృష్టిలో ఉత్పాదకత అంటే ఉత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు. నాణ్యత, సమర్థత, వ్యర్థాల నియంత్రణ కూడా అంతే ముఖ్యం. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత సాధించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యం పెరుగుతుంది. దేశ ఆర్థిక స్థిరత్వానికి ఇది కీలకం. కార్యాలయాల్లో కూడా ఉత్పాదకత ప్రధాన చర్చగా మారుతోంది. ఉద్యోగులు కేవలం గంటలు గడపడం కాదు, ఫలితాలపై దృష్టి పెట్టాలి. సమయ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జట్టు భావన ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయి. పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కూడా పనితీరును మెరుగుపరుస్తుంది. అలసటతో పని చేసే వ్యక్తి కంటే ఉత్సాహంతో పని చేసే వ్యక్తి ఎక్కువ ఫలితాలు ఇస్తాడు.

విద్యాసంస్థల్లో ఉత్పాదకత చర్చలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే యువతను తయారు చేయాలంటే, విద్యా వ్యవస్థలోనే ఉత్పాదకత విలువలు నాటాలి. జాతీయ ఉత్పాదకత దినం మనకు ఒక ముఖ్యమైన ప్రశ్నను వేస్తుంది. మనం చేసే ప్రతి పనిలో సమర్థత ఉందా? సమయాన్ని వృథా చేస్తున్నామా? వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతకడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థల పరంగా, దేశ స్థాయిలో మార్పు సాధ్యమవుతుంది.

ఉత్పాదకత అంటే కేవలం ఎక్కువ పని చేయడం కాదు. తెలివిగా పని చేయడం. సమయాన్ని గౌరవించడం. వనరులను కాపాడడం. నైపుణ్యాలను పెంపొందించడం. ఇవన్నీ కలిసినప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ప్రతి పౌరుడు తన పనిని సమర్థంగా నిర్వహించినప్పుడే జాతీయ స్థాయిలో ఉత్పాదకత పెరుగుతుంది. మొత్తంగా జాతీయ ఉత్పాదకత దినం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది ప్రతి రోజు ఆచరణగా మారాలి. వ్యక్తిగత క్రమశిక్షణ నుంచి దేశ ఆర్థికాభివృద్ధి వరకు, ఉత్పాదకతే ప్రధాన బలం. సమయాన్ని గౌరవించే సమాజమే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.

## ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

- మంచిర్యాల హైటెక్ సిటీలోని 227వ బూత్‌లో ఓటు
- నివాసం నుంచి నడుచుకుంటూ వెళ్లి ఓటు వేసిన మంత్రి
- కాంగ్రెస్‌కు ఘన విజయం ఖాయమని విశ్వాసం




**మంచిర్యాల, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీలోని 227వ బూత్‌లో కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి తన నివాసం నుంచి నడుచుకుంటూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. సాధారణ ఓటరుగా క్యూలో నిలబడి తన ఓటు నమోదు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం ప్రజాస్వామ్యానికి శుభసూచకమని అన్నారు.

రాష్ట్రంలోని 85 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని మెచ్చుకుని మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని గుర్తుచేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 12 - ఫిబ్రవరి 2026


## బాల్య మిత్రులు – జీవితాంతం నిలిచే
# జ్ఞాపకాల అనుబంధం



బాల్య మిత్రులు జీవితంలో ఎంతో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంటారని సామాజిక నిపుణులు చెబుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో మొదలైన పరిచయాలు, వీధి ఆటల్లో పుట్టిన స్నేహాలు కాలక్రమంలో మరపురాని అనుబంధాలుగా మారుతాయని పేర్కొంటున్నారు. ఆ స్నేహంలో లాభనష్టాలు, స్వార్థం, హోదాలు ఉండవని, కేవలం ఆనందం, అమాయకత్వమే ఉంటాయని పెద్దలు గుర్తుచేస్తున్నారు.

**ఆటలు, అల్లరితో పెరిగిన బంధం**

గిల్లీ దండా, క్రికెట్, చిర్రగోనె, దాగుడుమూతలు వంటి ఆటల్లో కలిసి గడిపిన రోజులు బాల్య మిత్రుల అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని చెబుతున్నారు. కలిసి చదవడం, కలిసి శిక్షలు పడటం, కలిసి నవ్వుకోవడం ఇవి జీవితాంతం గుర్తుండే జ్ఞాపకాలుగా నిలుస్తాయని నిపుణులు అంటున్నారు. బాల్యంలో ఏర్పడిన ఆ అనుబంధం ఎంతో సహజంగా, నిర్మలంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

బాల్య మిత్రులు జీవితంలో కష్టసమయాల్లో కూడా మనసుకు ధైర్యం ఇచ్చే వారిగా నిలుస్తారని మానసిక నిపుణులు చెబుతున్నారు.

కాలం, దూరం మారినా బాల్య స్నేహం మాత్రం అంతే బలంగా కొనసాగుతుందని పేర్కొంటున్నారు. మనల్ని మనం అర్థం చేసుకునే, గతాన్ని గుర్తుచేసే మిత్రులు మనసుకు ఒక ప్రత్యేకమైన ఆనందాన్ని ఇస్తారని వారు అంటున్నారు. డిజిటల్ యుగంలో స్నేహం కొత్త రూపం నేటి కాలంలో ఉద్యోగాలు, వలసలు కారణంగా బాల్య మిత్రులు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా, సోషల్ మీడియా ద్వారా మళ్లీ కలుసుకునే అవకాశం పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ ముఖాముఖి కలయిక ఆనందం ప్రత్యేకమని వారు సూచిస్తున్నారు. బాల్య మిత్రులు కేవలం స్నేహితులు మాత్రమే కాదు; వారు మన జీవిత కథలో మధురమైన అధ్యాయంగా నిలిచే వ్యక్తులని పెద్దలు భావోద్వేగంగా చెబుతున్నారు.

# బాల్యంలో సహజ స్వభావం, సర్రైన దిశలో మలిస్తే మేలు



పిల్లల అల్లరిని చాలా మంది తల్లిదండ్రులు సమస్యగా భావిస్తుంటారు. అయితే మానసిక నిపుణుల అభిప్రాయం ప్రకారం అల్లరి అనేది పిల్లల సహజ స్వభావం. శరీరంలో ఉన్న శక్తిని బయటపెట్టే మార్గమే అల్లరిగా కనిపిస్తుందని వారు చెబుతున్నారు. పరుగులు తీయడం, ఎగరడం, గట్టిగా నవ్వడం, ప్రశ్నలు అడగడం ఇవి బాల్యంలో చురుకుదనానికి సూచికలని నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లలు నిశ్శబ్దంగా ఉండటం కన్నా, చురుకుగా ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వారు అంటున్నారు.


**అల్లరిలో దాగి ఉన్న అభివృద్ధి లక్షణాలు**

పిల్లలు అల్లరి చేసే సమయంలోనే కొత్త విషయాలు నేర్చుకుంటారని విద్యా నిపుణులు చెబుతున్నారు. గోడలపై గీతలు వేయడం, వస్తువులను తడుముకోవడం, ఆటబొమ్మలను విడగొట్టడం ఇవి వారి అన్వేషణ స్వభావాన్ని చూపుతాయని పేర్కొంటున్నారు. అల్లరిలో భాగంగా వారు సమతుల్యం, సమన్వయం, సంభాషణ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటారని చెబుతున్నారు. కాబట్టి అల్లరిని పూర్తిగా అణచివేయడం కన్నా, దాన్ని సరైన దిశలో మలచడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**తల్లిదండ్రుల పాత్ర కీలకం**

పిల్లల అల్లరిని కఠినంగా అరికట్టడం వల్ల వారు భయపడే స్వభావం పెరిగే అవకాశం ఉందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అల్లరి చేసినప్పుడు శాంతంగా మాట్లాడి, ఏది సరైనది, ఏది తగనిది అన్నది వివరించడం అవసరమని చెబుతున్నారు. పిల్లలకు ఆడుకునే స్థలం, సమయం ఇవ్వడం ద్వారా అల్లరిని సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించవచ్చని సూచిస్తున్నారు. అల్లరి వెనుక దాగి ఉన్న అవసరాలను గుర్తించడం తల్లిదండ్రుల బాధ్యత అని నిపుణుల అభిప్రాయం. బాల్యాన్ని ఆస్వాదించని వ్వాలి పిల్లల అల్లరి బాల్యానికి గుర్తు. చదువు, పోటీ, నియమాల మధ్య వారి సహజ స్వభావాన్ని కోల్పోకుండా చూసుకోవడం కుటుంబాల బాధ్యతగా నిపుణులు చెబుతున్నారు. అల్లరిలోనే నవ్వులు, జ్ఞాపకాలు, అనుబంధాలు దాగి ఉంటాయని పెద్దలు అంటున్నారు. క్రమశిక్షణతో పాటు ప్రేమ, ఓర్పు కలిపి పిల్లలను మార్గనిర్దేశం చేస్తే వారి అల్లరి భవిష్యత్తులో సృజనాత్మకతగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తాత – మనుమడు బంధం – అనుభవం, అమాయకత్వం కలిసే అనుబంధం



తాత-మనుమడు బంధం కుటుంబంలో ఎంతో ప్రత్యేకమైన అనుబంధంగా భావించబడుతుంది. తాత అనుభవాల నిధి అయితే, మనుమడు అమాయకత్వానికి ప్రతీకగా ఉంటాడని సామాజిక నిపుణులు చెబుతున్నారు. ఈ ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ, అర్థం చేసుకునే స్వభావం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుందని పేర్కొంటున్నారు. తాత ఒడిలో కూర్చుని కథలు వినే మనుమడు బాల్యం ఎంతో మధురంగా మారుతుందని పెద్దలు గుర్తుచేస్తున్నారు.

**జ్ఞానం, విలువల పాఠశాల తాతలు**

జీవిత అనుభవాల ద్వారా నేర్చుకున్న విలువలను మనుమళ్లకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని విద్యావేత్తలు చెబుతున్నారు. నీతి, ధైర్యం, ఓర్పు, కష్టపడి పనిచేయడం వంటి గుణాలు కథల రూపంలో, సంభాషణల ద్వారా సహజంగానే పిల్లలకు అలవడతాయని పేర్కొంటున్నారు. పాఠ్యపుస్తకాల్లో లేని అనుభవ జ్ఞానం తాతల ద్వారా మనుమళ్లకు అందుతుందని నిపుణుల అభిప్రాయం.

**మనసుకు భరోసా, భావోద్వేగ బలం**

తాతతో గడిపే సమయం మనుమడికి మానసికంగా భరోసా కలిగిస్తుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు బిజీగా ఉన్నప్పటికీ, తాతతో మాట్లాడే అవకాశం పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొంటున్నారు. అలాగే మనుమడితో ఆడుకోవడం, మాట్లాడడం తాతలకు కూడా మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తుందని సూచిస్తున్నారు.

**కాలంతో మారుతున్న బంధం**

నేటి డిజిటల్ యుగంలో కుటుంబాలు చిన్నవవుతుండటంతో తాత-మనుమడు బంధం కొంతమేర దూరమవుతున్నదని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ఈ అనుబంధాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. రోజుకు కొద్దిసేపైనా కలిసి గడపడం, సంభాషణ కొనసాగించడం ద్వారా ఈ బంధం మరింత బలపడుతుందని పేర్కొంటున్నారు. తాత-మనుమడు అనుబంధం కేవలం కుటుంబ సంబంధం మాత్రమే కాదు; అది తరాల మధ్య విలువలను కలిపే సజీవ వంతెనగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తోటకూర – రక్తవర్ధక ఆకుకూర, ఆరోగ్యానికి సహజ బలం



తోటకూర తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా లభించే, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఆకుకూరగా గుర్తింపు పొందింది. పప్పుతో, వేపుడుగా, కూరగా, చారుగా ఇలా అనేక రూపాల్లో వండుకునే ఈ కూర రుచితో పాటు పోషక విలువలతో కూడినదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వెనుక భాగంలోనే పెంచుకునే సంప్రదాయం ఉండేదని పెద్దలు గుర్తుచేస్తున్నారు.

**ఐరన్ సమృద్ధిగా - రక్తహీనతకు ఉపశమనం**

తోటకూరలో ఐరన్ అధికంగా ఉండటంతో రక్తహీనత సమస్య తగ్గించడంలో ఇది సహాయపడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు తోటకూరను క్రమం తప్పకుండా తీసుకుంటే హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయని సూచిస్తున్నారు. అలాగే ఇందులో విటమిన్-ఏ, విటమిన్-సి ఉండటంతో కంటి చూపు, రోగనిరోధక శక్తి మెరుగవుతాయని చెబుతున్నారు.

**జీర్ణక్రియ, ఎముకల బలానికి తోడ్పాటు**

తోటకూరలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ సక్రమంగా సాగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మలబద్ధకం సమస్య తగ్గడంలో ఇది ఉపకరిస్తుందని చెబుతున్నారు. అలాగే కాల్షియం వంటి ఖనిజాలు ఉండటంతో ఎముకల బలానికి కూడా తోడ్పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లల ఎదుగుదలలో తోటకూర పాత్ర ముఖ్యమని నిపుణుల అభిప్రాయం.

**సరైన విధంగా వండితేనే పూర్తి లాభం**

తోటకూరను బాగా కడిగి, తక్కువ సమయంలో వండితే పోషకాలు నిల్వ ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. అతిగా మరిగించడం వల్ల పోషకాలు తగ్గే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వారానికి రెండు నుంచి మూడు సార్లు తోటకూరను ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అవసరమైన అనేక పోషకాలు సహజంగానే లభిస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ముందస్తు గుర్తింపే ప్రాణ రక్షణ



మహిళల్లో పెరుగుతున్న ఆందోళనకర వ్యాధి రొమ్ము క్యాన్సర్ నేటి కాలంలో మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న వ్యాధులలో ఒకటిగా వైద్య నిపుణులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ వ్యాధి కేసులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. జీవనశైలి మార్పులు, ఆలస్యంగా పెళ్లి, హార్మోన్ మార్పులు, కుటుంబ చరిత్ర వంటి అంశాలు ప్రమాదాన్ని పెంచే కారకాలుగా భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే తొందరగా గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**ప్రారంభ లక్షణాలు గుర్తించడం అత్యంత ముఖ్యం**

రొమ్ములో గడ్డలా అనిపించడం, చర్మంలో మార్పులు కనిపించడం, నొప్పి లేకుండానే గట్టిగా ఉండే భాగం ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిప్పుల నుండి అసాధారణ స్రావం రావడం, రొమ్ము ఆకారంలో మార్పు రావడం కూడా హెచ్చరికలుగా భావించాలని సూచిస్తున్నారు. ప్రతి మహిళ నెలకు ఒకసారి స్వీయ పరీక్ష చేసుకోవడం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.


**మామోగ్రఫీ పరీక్షతో ముందస్తు గుర్తింపు**

40 సంవత్సరాలు దాటిన మహిళలు వైద్యుల సలహా మేరకు మామోగ్రఫీ పరీక్ష చేయించుకోవడం చాలా అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబంలో రొమ్ము క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. తొలి దశలో గుర్తిస్తే శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలతో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొంటున్నారు.

**అవగాహన, ధైర్యమే ప్రధాన ఆయుధాలు**

రొమ్ము క్యాన్సర్‌పై భయం కంటే అవగాహన ముఖ్యం అని వైద్యులు చెబుతున్నారు. సరైన ఆహారం, వ్యాయామం, బరువు నియంత్రణ, ధూమపానం నివారణ వంటి జీవనశైలి మార్పులు ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని సూచిస్తున్నారు. ముఖ్యంగా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు గుర్తింపు, సమయానికి చికిత్సే రొమ్ము క్యాన్సర్‌పై విజయానికి కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# వర్షం – ప్రకృతి వరం, జీవనానికి ప్రాణం



ప్రకృతి చక్రంలో వర్షం కీలకం వర్షం భూమిపై జీవం నిలిచే ప్రధాన ఆధారం అని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. పంటల పెరుగుదల, భూగర్భ జలాల నింపుదల, వాతావరణ సమతుల్యత అన్నీ వర్షంపై ఆధారపడి ఉంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులకు వర్షం ఒక ఆశగా, భవిష్యత్తుకు భరోసాగా మారుతుందని చెబుతున్నారు. సమయానికి కురిసే వర్షం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి అందిస్తుందని నిపుణుల అభిప్రాయం.

**వ్యవసాయానికి జీవనాడి**

వర్షపాతం సరిగా లేకపోతే పంటలు ఎండిపోవడం, దిగుబడి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నీటిపారుదల సౌకర్యాలు ఉన్నా, సహజ వర్షం ఇచ్చే లాభం వేరేలా ఉంటుందని పేర్కొంటున్నారు. చెరువులు, కుంటలు, వాగులు నిండితేనే గ్రామాల నీటి అవసరాలు తీరుతాయని చెబుతున్నారు. అందుకే వర్షాన్ని రైతులు పండుగలా స్వాగతిస్తారని అంటున్నారు. వర్షం కేవలం వ్యవసాయానికే కాదు, మనసుకూ ఆనందం ఇస్తుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. వర్షపు చినుకులు పడే శబ్దం, మట్టి వాసన మనసును ప్రశాంతంగా మార్చుతాయని పేర్కొంటున్నారు. పిల్లలు వర్షంలో ఆడుకోవడం, పెద్దలు వాన చూసి సేదతీరడం వంటి దృశ్యాలు జీవనంలో చిన్న ఆనందాలను గుర్తు చేస్తాయని చెబుతున్నారు. వర్షాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం వర్షం కురిసిన నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవడం అత్యంత అవసరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పద్ధతులను ప్రతి ఇల్లు, ప్రతి గ్రామం పాటిస్తే భవిష్యత్తులో నీటి కొరత సమస్యను తగ్గించవచ్చని సూచిస్తున్నారు. వర్షం ప్రకృతి వరం అయినప్పటికీ, దాన్ని సక్రమంగా వినియోగించుకోవడం మన బాధ్యత అని వారు పేర్కొంటున్నారు. వర్షాన్ని గౌరవించి, సంరక్షిస్తేనే భూమిపై జీవన సౌభాగ్యం కొనసాగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో
# ఎస్ ఎస్ కె అకాడమీకి స్వర్ణవిజయం

- **నాగారం విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు**



**నాగారం, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్ నాగారం ప్రాంతానికి చెందిన ఎస్ ఎస్ కె మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై మరోసారి ప్రతిభ చాటారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 8న నిర్వహించిన 5వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2026లో అకాడమీ విద్యార్థులు స్వర్ణ, వెండి పతకాలు సాధించి గర్వకారణంగా నిలిచారు.అకాడమీ వ్యవస్థాపకులు, ప్రధాన శిక్షకులు మాస్టర్ కే. సాయి కిరణ్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు కటాస్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచారు. పోటీల్లో పి. ప్రిషిత శ్రీ, చిట్టి పావిక, వి. హరివర్ధన్ గౌడ్, ఏ. విద్యా శ్రీ స్వర్ణ పతకాలు సాధించగా, కే. నుక్రీతిక, వి. ఓం ప్రకాష్ సాగర్ వెండి పతకాలు గెలుచుకున్నారు.విద్యార్థుల విజయానికి క్రమశిక్షణతో కూడిన కఠిన శిక్షణ, నిరంతర సాధన ప్రధాన కారణమని మాస్టర్ కే. సాయి కిరణ్ తెలిపారు. విజేతలను తల్లిదండ్రులు, స్థానిక క్రీడాభిమానులు అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి కీర్తి తీసుకురావడమే తమ లక్ష్యమని అకాడమీ నిర్వాహకులు వెల్లడించారు.

# పుదుచ్చేరిలో ఉగ్రవాద వ్యతిరేక విన్యాసాలు

- మూడు రోజుల పాటు సంయుక్త దళాల విన్యాసాలు
- వాయుసేన, పోలీసులతో సమన్వయ కార్యాచరణ
- హెలికాప్టర్ కార్యకలాపాలు, పైకప్పు దాడుల సాధన

చెన్నైకి చెందిన 27 ప్రత్యేక కమాండో బృందం పుదుచ్చేరిలో ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు ఉగ్రవాద వ్యతిరేక విన్యాసాలు నిర్వహించింది. ఈ విన్యాసాలు భారత వాయుసేన, పుదుచ్చేరి పోలీసుల సమన్వయంతో చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 150కు పైగా కమాండోలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నారు. సంయుక్త సిద్ధత, పరస్పర అనుసంధానం సామర్థ్యాన్ని పరీక్షించుకోవడమే ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. హెలికాప్టర్ కార్యకలాపాలు, భవనాల పైకప్పులపై దిగుబడి సాధన, నగర ప్రాంతాల్లో కచ్చితమైన యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. విపత్తు పరిస్థితులు లేదా ఉగ్రవాద ముప్పు ఏర్పడిన సందర్భాల్లో వేగంగా స్పందించేందుకు దళాల మధ్య సమన్వయం బలోపేతం చేయడం ఈ విన్యాసాల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి సంయుక్త సాధనల ద్వారా భద్రతా దళాల సిద్ధత మరింత మెరుగుపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.





# స్నేహసేతువుల బలోపేతం దిశగా భారత్-బహ్రెయిన్ చర్చలు

- రిఫ్ఫా రాజప్రాసాదంలో భేటీ
- ద్వైపాక్షిక సంబంధాలు, నౌకాదళ సహకారంపై దృష్టి
- సమాచార మార్పిడి, సంయుక్త శిక్షణ అంశాలపై చర్చ



భారత నౌకాదళ ఉప ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ తరుణ్ సోబతి బహ్రెయిన్ యువరాజు, సాయుధ దళాల ఉప సర్వోన్నతాధికారి మరియు ప్రధాన మంత్రి సల్మాన్ బిన్ హమద్ అల్ ఖలీఫాను రిఫ్ఫా రాజప్రాసాదంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా భారత్-బహ్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై విస్తృత చర్చలు జరిగాయి. ఇరు దేశాల నౌకాదళాల మధ్య సమాచార మార్పిడి, సంయుక్త శిక్షణ, సామర్థ్య నిర్మాణం, భవిష్యత్ యుద్ధ సన్నద్ధత వంటి అంశాలపై చర్చలు కేంద్రీకృతమయ్యాయి. సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వం విషయంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. భారత్-బహ్రెయిన్ స్నేహ సంబంధాలను మరింత బలపరిచే దిశగా ఈ భేటీ కీలకంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఇరు దేశాల నౌకాదళాల మధ్య అనుసంధానం పెంపు ద్వారా సముద్ర భద్రతలో సమన్వయం మెరుగుపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.


# అమెరికా ఒత్తిడికి కేంద్రం తలొగ్గింది: రాహుల్ గాంధీ

- **వాణిజ్య ఒప్పందం భారత్‌కు నష్టం చేస్తుందన్న విమర్శ**
- **కృత్రిమ మేధ, డేటా భద్రతపై లోక్‌సభలో ఆందోళన**

అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో మాట్లాడుతూ, ఈ ఒప్పందం పూర్తిగా అమెరికాకు మేలు చేసేలా ఉందని, భారత్‌కు స్పష్టమైన లాభం కనిపించడం లేదని విమర్శించారు. ప్రపంచంలో వేగంగా మారుతున్న పరిస్థితులను బడ్జెట్ ప్రతిబింబించలేదని అన్నారు. ప్రపంచం కృత్రిమ మేధ యుగంలోకి అడుగుపెడుతోందని, దీనివల్ల భారత ఐటీ రంగం, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడవచ్చని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కృత్రిమ మేధకు ఇంధనం డేటా అని, భారత యువత మరియు వారి డేటా దేశానికి అతిపెద్ద ఆస్తి అని తెలిపారు. అమెరికా కంపెనీలకు పన్ను రాయితీలు ఇస్తూ, దేశ డేటా భద్రతపై సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అమెరికా సూచనల మేరకే భారత్ చమురు కొనుగోళ్లు, దిగుమతులు నిర్ణయించుకుంటోందని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు భారత ఉత్పత్తులపై తక్కువ శాతం పన్ను ఉండగా, ఇప్పుడు అది పెరిగిందని అన్నారు. అమెరికా దిగుమతులు గణనీయంగా పెరిగినప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థకు ఈ ఒప్పందం భరోసా ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. ప్రసంగం సమయంలో కొన్ని ఇతర అంశాలను ప్రస్తావించడంపై సభలో గందరగోళం నెలకొంది. అధికారపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయగా, సభాధ్యక్షుడు బడ్జెట్ అంశాలకే పరిమితమవ్వాలని సూచించారు. చివరగా కేంద్ర ప్రభుత్వం అమెరికాకు తలొగ్గిందని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ముగించారు.



# ఒక్క ఆలింగనం.!



దుఃఖం అనంత సాగరమైనప్పుడు
గుండె మీద వెయ్యి ఏనుగుల బరువు
ఊపిరి సలపనివ్వనప్పుడు
మాటలు మూగబోతాయి
మౌనమే రాజ్యమేలుతుంది.

పాదాల కింద అసలు నేలే లేనట్టు
వున్నా దారులన్ని
తాళం వేసి మూసిపెట్టినట్టు
ఏదో సూన్యం అవహిస్తుంది.
బైటి ప్రపంచం మసక బారుతుంది.



తనతో తానే చేసే యుద్ధంలో
గెలుపేమిటో, ఓటమేంటో తెలీని సందిగ్దంలో
క్షణనికోసారి పేలి
బూడిదై రాలుతుంటుంది.
బతుకు భారమై
చావు పిలుస్తున్నట్లు
చెవుల్లో మొగే కేకలు తాళలేక
వెర్రిగా అరుస్తుంటుంది.
నాలుగు గోడలు బద్దలయ్యేలా
గుక్కపట్టి ఏడుస్తుంటుంది.

మందులు, మాకులు
కౌన్సిలింగ్లేవి ఆమెని నయం చేయలేవు
ఒక్క ప్రేమపూర్వకమైన ఆలింగనం తప్ప.
ముక్కలైన ఆమే హృదయాన్ని కుట్లేయాడానికి
సూది, దారం అక్కర్లేదు.
భరోసానిచ్చే ఒక్క ఆలింగనం చాలు.

అవును
మోసపోయిన స్త్రీలు,
నమ్మకం కోల్పోయి
జీవచ్ఛవంలా పడి వున్నా వాళ్ళేమి
మానసిక రోగులు కారు.
మనుషుల్లో మనిషితనం కోసం వెతికి వెతికి
విసిగిపోయిన అభాగ్యులు అంతే.

వాళ్లకి డాక్టర్లు, ఆసుపత్రులు
అవసరం లేదు
మళ్ళీ జీవితం మీద
ఆశ కలిపించే
కల్మషం లేని
ఒక్క ఆలింగనం చాలు.
మళ్ళీ కొత్తగా పుడతారు వాళ్ళు.
పాత హుషారుని లాక్కొచ్చుకుంటారు.



దియా విఘ్నేష్

## పట్టుదల ఫలితం ఖమ్మంకి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య
# సీఎంఏలో ఘన విజయం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం నగరానికి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్‌లో సిఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్) కోర్సును పూర్తి స్థాయిలో విజయవంతంగా ఉత్తీర్ణతతో సాధించారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువు ఆమెను ఈ ఉన్నత విజయానికి చేర్చిందని ఉపాధ్యాయులు ప్రశంసించారు. అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్ళ గూడెంలోని మాంటిస్సోరి హైస్కూల్ లో విద్యనభ్యసించి, టెన్త్‌లో 9.5 జి.పి.ఎ సాధించారు. సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్లలో కాలేజ్ టాపర్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు. ఆమె తల్లిదండ్రులు అర్వపల్లి నాగేష్, శ్రీలక్ష్మి స్థానికంగా చిన్న కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ కుమార్తె చదువుకు అన్ని విధాలుగా వారి సంపూర్ణ సహకారం అందించారు. చెల్లెలు యువ నాగశ్రీ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానికులు, అలాగే ఆమె చిన్ననాటి స్నేహితురాలు షేక్ తబస్సుమ్ అఖిల నాగ రమ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in